వ్యర్థాల సేకరణ సిబ్బంది బదిలీలను నిలిపేయాలి



కాచిగూడ: వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డ్రైవర్లు, క్లీనర్లు ఇతర సిబ్బంది బదిలీలను వెంటనే నిలిపేసి యథావిధిగా కొనసాగించాలని పలు మున్సిపల్ ట్రేడ్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మున్సిపల్ ట్రేడ్ యూనియన్ జేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అదిల్ షరీఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ మున్సిపల్ విభాగం ప్రధానకార్యదర్శి జైపాల్‌రెడ్డి, టీటీయూసీ అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి, టీజేఎస్ నేతలు జహీరుద్దీన్, బాల నర్సింహ్మ, షరీఫ్‌లు మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ చెత్త తరలింపులో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ డ్రైవర్లు, క్లీనర్లు, ఇతర సిబ్బంది 1500 వరకు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారిలో ఇప్పటికే వేయి మందిని పార్కులు, వాటర్ వర్క్స్‌కు బదిలీ చేశారని వారు ఆరోపించారు. ఈ బదిలీలను తక్షణమే నిలిపేసి సిబ్బందిని యథావిధిగా కొనసాగించాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ వాహనాల రిపేరింగ్ బాధ్యతలను ఆర్టీసీకి అప్పగించాలని వారు కోరారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్, డ్రైవర్లు, క్లీనర్ల ఇబ్బందులను వివరిస్తామన్నారు.

పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి



పనులను పరిశీలిస్తున్న విద్యా మండలి డిప్యూటీ ఈవో చిరంజీవి, ఐవోఎస్ స్వరూపారాణి

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన అమ్మా ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా ముషీరాబాద్ విద్యా మండలి పరిధిలోని 22 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ముషీరాబాద్ విద్యా మండలి డిప్యూటీ ఈవో చిరంజీవి తెలిపారు. సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన మరుగుదొడ్ల ప్యాచ్‌వర్క్ నిర్మాణ పనులు, డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో పాఠశాలలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు మండలం-1 పరిధిలోని పాఠశాలలకు రూ.30 లక్షలు, మండల-2 పాఠశాలలకు రూ.76.90 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

◆ మొదటి విడతగా మండల పరిధిలోని 22 పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలకు రూ.40 వేలు కేటాయించిందన్నారు. ఈ నిధులతో టాయిలెట్ల మరమ్మతులు, విద్యుత్తు, తాగునీరు, స్లాబ్ మరమ్మతులు తదితర పనులకు నిధులను వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.

◆ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచడంతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ముషీరాబాద్ విద్యా మండలి డిప్యూటీ ఐఓఎస్‌లు స్వరూపారాణి, జయలక్ష్మి, ఉపాధ్యాయులు నరేందర్‌యాదవ్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

'ఖగోళయాత్ర'ను జయప్రదం చేయండి

కాచిగూడ: లోక కల్యాణార్థం చేసే ఈ భూమండల యాత్ర చరిత్రలో నిలవడం ఖాయమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. భద్రాచలం శ్రీరాములవారి దేవాలయం అమెరికాలో నిర్మిస్తున్న అర్చకులు పద్మనాభ ఆచార్యులు సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో డాక్టర్ ఎస్.గౌతంరావును కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఖగోళయాత్ర గురించి వివరించి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. సీతారాముల సంకల్పంతో నిర్వహించే ఈ యాత్ర కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం కావాలని గౌతంరావు ఆకాంక్షించారు.

◆ ఈ సందర్భంగా కాచిగూడ కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, ఆర్.సంతోష్, నాగరాజు, పంకజ్, ఎస్ఎస్.రెడ్డి, కృష్ణ, ఎస్.రవి యాదవ్‌లను ఖగోల యాత్ర ప్రతినిధులు కలిసి ఆహ్వానించారు.



బీజేపీ నేత గౌతంరావుకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న ప్రతినిధులు

'సంఘర్ జాతి సంఘ్'కమిటీ సభ్యుల రాజీనామా



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

నల్లకుంట: సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ఐదేళ్ల కాలపరిమితి పూర్తయినందున కమిటీని రద్దు చేస్తున్నామని కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం నల్లకుంటలో సంఘర్ జాతి సంఘ్ సమావేశం నిర్వహించారు. సంఘ్ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ ప్రధాన కార్యదర్శి నర్సింగ్ రావు, కోశాధికారి కైలాష్, ఇతర పదాధికారులు తమ పదవులకు రాజీనామా చేశారు. త్వరలోనే సంఘ్ కోర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి సభ్యులందరి సమక్షంలో లావాదేవిల ఆడిటింగ్ నిర్వహించి నూతన కమిటీ ఎన్నికల తేదీని ప్రకటిస్తామని లక్ష్మణ్‌కుమార్ తెలిపారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నేత మృతి



ప్రవీణ్ పటేల్ (ఫైల్)

అంబర్‌పేట: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాగుల ప్రవీణ్ పటేల్ (41) గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం తెల్లవారుజామున పటేల్‌నగర్‌లో నివాసం ఉంటున్న ప్రవీణ్ పటేల్ ఒంట్లో ఇబ్బందిగా ఉండటంతో స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పార్టీ నాయకులు ఆయనను కాచిగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బీపీ, షుగర్ స్థాయిలు పెరగడంతో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల నుంచి ప్రవీణ్ బీఆర్ఎస్ పార్టీలో చురుకైన నేతగా వ్యవహరించారని ఆయన పార్టీకి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. బీఆర్ఎస్ నేతలు ఎర్రబోలు నర్సింహ్మారెడ్డి, శ్రీరాములు , సిద్ధు ముదిరాజ్ తదితరులున్నారు.

దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకి ఘన నివాళి

ముషీరాబాద్: దేశాభివృద్ధి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఎంతో కృషి చేశారని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సోమవారం ఆయన వర్ధంతి సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, దేశం కోసం యావదాస్తిని అర్పించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహ్మారెడ్డి, సాయి, సతీష్ తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని శారద కల్చరల్ స్టూడియోలో గాయని శారద ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 45 పాటలతో ప్రత్యేక సినీసంగీత విభావరి ఎపిసోడ్-1 పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. సినీగేయకవులు ఆత్రేయ, ఆరుద్ర రచించిన గీతాలను గాయనీగాయకులు సుభాష్, ఆమని, వేణుగోపాల్, శంకరయ్య, సుబ్రహ్మణ్యం, చందనలు ఆలపించారు. ఈ సందర్భంగా సుభాష్, ఆమనిలను సంఘసేవకులు భాస్కర్, గాయని అచ్యుతవల్లి సత్కరించారు.

పొరుగు బస్సులతో బేజారు..!

● వందల సంఖ్యలో రోజూ రాకపోకలు సాగిస్తున్న వైనం
● కాచిగూడ, ఆర్టీసీ క్వార్టర్స్ తీరు



కాచిగూడ ఆర్టీసీ క్వార్టర్స్ ఆవరణలో పార్క్ చేసిన అంతర్రాష్ట్ర బస్సులు

కాచిగూడ: ఆర్టీసీ క్వార్టర్స్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులకు ఆర్టీసీ అధికారులు కాచిగూడ ఆర్టీసీ క్వార్టర్స్ మధ్య ఖాళీ స్థలంలో వసతి కల్పించారు. దీంతో రోజూ వందల సంఖ్యలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇతర రాష్ట్రాల బస్సులు ఇక్కడికి వచ్చి వెళ్తుంటాయి. దీంతో స్థానికులు శబ్ద,వాయు కాలుష్యంతో సతమతమవుతున్నారు. ఇతర రాష్ట్రాల బస్సులను ఆర్టీసీ క్వార్టర్స్‌లో నిలపకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు.

విశాలమైన స్థలం..

కాచిగూడ ఆర్టీసీ క్వార్టర్స్ 12 ఎకరాల విశాలమైన స్థలంలో విస్తరించి ఉన్నాయి. ఇందులోని ఐదెకరాలలో ఆర్టీసీ క్వార్టర్లను కూల్చివేసి కొత్త ఆర్టీసీ బస్‌డిపో నిర్మాణాన్ని చేపట్టారు. మిగిలిన ఏడెకరాల్లో ప్రస్తుతం ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు కొన్ని క్వార్టర్స్ బ్లాక్‌లు ఉన్నాయి. వీటిలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, డిపోల్లో పనిచేసే మెకానిక్‌లు ఇతర సిబ్బంది తమ కుటుంబాలతో నివసిస్తున్నారు. ఈ క్వార్టర్ల మధ్య విశాలమైన ఖాళీ స్థలం ఉంది.



బస్సులకు అనుకూలంగా...

ఆర్టీసీ క్వార్టర్స్ మధ్యన మిగిలిన ఖాళీ స్థలంలోనే కర్ణాటక, మహారాష్ట్ర బస్సులను నిలిపి ఉంచేందుకు వసతిని కల్పిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని వందల కిలోమీటర్ల నుంచి నగరానికి వచ్చే పొరుగు రాష్ట్రాల బస్సు డ్రైవర్లు, కండక్టర్లు విశ్రాంతి తీసుకోవడానికి ఆర్టీసీ క్వార్టర్స్‌లో వారికి ఆర్టీసీ బస సౌకర్యాన్ని కల్పించారు. ఉదయం, రాత్రి పూట ఇక్కడికి వచ్చే బస్సులు డ్రైవర్లు, కండక్టర్లు విశ్రాంతి తీసుకున్న తర్వాత బయలుదేరి వెళ్తాయి. అప్పటి వరకు వాటిని ఇక్కడ నిలిపి ఉంచుతారు.

రోడ్డు ప్రమాదాలు...

ఇమ్లిబన్ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి పొరుగు రాష్ట్రాల బస్సులు చాదర్‌ఘాట్ చౌరస్తా, హ్రాస్‌పెంట, కాచిగూడ అక్వాహోటల్ చౌరస్తా, సుందర్‌నగర్, సీబీఐ క్వార్టర్స్ మీదుగా ఆర్టీసీ క్వార్టర్స్‌కు వస్తుంటాయి. బస్సులు రాత్రి, పగలు తేడా లేకుండా రాకపోకలు సాగించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటితో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రసిద్ధిగాంచిన కలియుగ దైవం చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రత్యేక పూజలు చేశారు. రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మన్నెదామోదర్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ దంపతులు, శంకర్‌ముదిరాజ్, ముదిగొండ మురళి, అరుణ్, ఎర్రంశేఖర్, జనార్దన్, కల్యాణ్‌నాయక్, రాజేందర్, జ్ఞానేశ్వర్‌గౌడ్, బలవంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



భరత్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్‌లోని భరత్‌నగర్‌లో తవ్విన రోడ్లతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్న సమాచారంతో కార్పొరేటర్ సోమవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి రోడ్డు పనులను ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

నియామకం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిలింగ్ అంతర్జాతీయ సలహాదారుడిగా ప్రముఖ విద్యావేత్త, తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సాదుల మధుసూదన్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ సంస్థ అధ్యక్షులు సీహెచ్. రంగయ్య, జాతీయ సలహాదారులు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డిలు నియామకపత్రాన్ని అందజేశారు. మూడు దశాబ్దాలకు పైగా విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ.. పర్యావరణ భావజాలాన్ని విద్యార్థుల్లో పెంచుతున్నందున ఆయన ఈ పదవికి అర్హులని రంగయ్య పేర్కొన్నారు.

బీసీలను యూనివర్సిటీ వీసీలుగా నియమించాలి

లిబర్టీ: తెలంగాణలోని విశ్వవిద్యాలయాలకు బీసీలను వైస్ చాన్సలర్లను నియమించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దళ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 10 విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్ల పదవీ కాలం ముగిసిందన్నారు. ఆయా స్థానాల్లో తాత్కాలికంగా ఐఏఎస్‌లో నియమించారని తెలిపారు. వైస్ చాన్సలర్‌ల నియమక కోసం ఇప్పటికే ప్రభుత్వం సెర్చ్ కమిటీలను నియమించిందన్నారు. 10 యూనివర్సిటీలలో బీసీ పదవుల్లో జనాభా దృష్టిలో పెట్టుకొని కనీసం ఐదుగురిని వీసీలుగా బీసీ ప్రొఫెసర్లను నియమించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో ఇద్దరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న కాచిగూడ ఏసీపీ రఘు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి

కాచిగూడ: యువత జల్సాలకు అలవాటు పడి నేరాలకు పాల్పడుతున్నారని, పిల్లల తల్లిదండ్రులు వారిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాచిగూడ ఏసీపీ వి.రఘు సూచించారు. సోమవారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డితో కలిసి ఏసీపీ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. రాంకోఠికి చెందిన వెమగిరి శ్యామ్‌బాబు ఈనెల 25న కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా శ్యామ్‌మందిర్ వద్ద సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా.. ఇద్దరు దుండగులు బెదిరించి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు రూ.1200 నగదును లాక్కొని పారిపోయారు. దీంతో బాధితుడు కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు అనుమానం వచ్చి..

కాచిగూడ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహబూబ్‌నగర్‌కు చెందిన అజురాపూర్ రాజు (30), సిద్దిపేటజిల్లాకు చెందిన అబ్దుల్ ఖయ్యూమ్ (25)లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరు కాచిగూడలోని ఫుట్‌పాత్‌లపై ఉంటారు. అజురాపూర్ రాజుపై మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసు ఉంది. వీరి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.700 నగదును పోలీసులు రికవరీ చేశారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సైలు సుభాష్, రవికుమార్, క్రైం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్లో చోరీలకు పాల్పడుతున్న మహిళ అరెస్ట్



నిందితురాలి వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్.జావేద్

కాచిగూడ: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ మహిళను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్. జావేద్, రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప మాట్లాడుతూ.. కొత్తగూడెంకు చెందిన ఉపేందర్, పుష్ప దంపతులు మణుగూర్ వెళ్లేందుకు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి రైలు ఎక్కారు. సీట్లో బ్యాగు, లగేజీ పెట్టి బంధువులకు వీడ్కోలు చెప్పడానికి రైలు డోర్ వద్దకు వచ్చి, తిరిగి వెళ్లేసరికి బంగారు ఆభరణాలు, నగదు, విలువైన బట్టలు ఉన్న బ్యాగు కనిపించలేదు. దీంతో బాధితులు కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాగులో 6 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 వేల నగదు, ఖరీదైన బట్టలు ఉన్నాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పదంగా కనిపించడంతో..

◆ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న కామారెడ్డి బాన్స్‌వాడ ప్రాంతానికి చెందిన తిరుపతి భార్య దాసరి మంజుల (31)ను అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరం అంగీకరించిందని పోలీసులు తెలిపారు. ఆమె నుంచి 56 గ్రాముల బంగారు ఆభరణాలు, బట్టలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

అవార్డుల ప్రదానం



అవార్డును అందజేస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

కాచిగూడ: ప్రముఖ సిద్ధాంతి చింతా గోపిశర్మకు వాస్తుబ్రహ్మ అవార్డును తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారి అందజేశారు. సూర్యచంద్ర కల్చరల్ అండ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును చింతా గోపీశర్మ అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. తనకు అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ అవార్డు తన సామాజిక బాధ్యతను మరింత పెంచిందన్నారు. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలందించేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. చాడ హనుమశాస్త్రి, సుబ్రహ్మణ్యం , భాగవతుల భవానీశర్మ, కవితాఫణి శర్మ, కామవరపు విజయమారుతి శర్మ, శర్మదలు అవార్డులను అందుకున్నారు.

గంజాయి విక్రయిస్తున్న పాత నేరస్తుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

ఖైరతాబాద్: ఎన్‌డీపీఎస్, ఆర్మ్స్ యాక్టు కింద ముగ్గురు నిందితులను సోమవారం ఖైరతాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ సమాచారం మేరకు... ఖైరతాబాద్‌కు చెందిన పాదిల ప్రకాష్ రాజ్ అలియాస్ డాలర్ పింటు(23), తాళ్లగడ్డ కార్వాన్‌కు చెందిన జాదవ్ రోహన్ సింగ్ ఎలియాస్ ఫన్నీ రోహన్(21), అయ్యప్ప సొసైటీకి చెందిన హస్మత్ నితిన్ గౌడ్ అలియాస్ నిక్కి(20) ముగ్గురు ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వీరిని తనిఖీ చేయగా వారి నుంచి డాలర్ పింటు వద్ద నుంచి 1100 గ్రాములు గంజాయి, కత్తి, బాకు స్వాధీనం చేసుకున్నారు. ఫన్నీ రోహిత్ జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, పోక్సో యాక్ట్ కింద నేరస్తుడు. నితిన్ గౌడ్ పాత నేరస్తుడు కావడంతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. రాత్రి వేళల్లో వీరు గంజాయి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఎవరైనా పట్టుకునేందుకు ప్రయత్నిస్తే మారణాయుధాలతో దాడి చేస్తారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సైఫాబాద్ ఏసీపీ ఆర్.సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. నారాయణగూడ ఫీడర్ పరిధిలో బాగ్‌లింగంపల్లి, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, సూర్యనగర్, దత్తనగర్, దీపక్ థియేటర్, అరోరా డిగ్రీ కళాశాల తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 12.30, చిక్కడపల్లి ఫీడర్ పరిధిలో చిక్కడపల్లి, వేంకటేశ్వరస్వామి దేవాలయం, ఉమాగార్డెన్, బాగ్‌లింగంపల్లిలో 12.30 నుంచి 2 వరకు, స్పెన్సర్స్ ఫీడర్ పరిధిలో శివాలయం, రాజాడిలక్స్, రేస్‌కోర్సెస్, చర్చి గల్లీ తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి 4 వరకు, గోల్కొండ ఎక్స్‌రోడ్డు ఫీడర్ పరిధిలో ఏక్‌మినార్ మజీద్, కృష్ణకాలనీ, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'దేవాదాయ శాఖను రద్దు చేయాలి'



సూర్య ప్రకాష్

నల్లకుంట: దేవాలయాల భూములను కాపాడలేని దేవాదాయ, ధర్మాదాయ శాఖను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ధార్మిక పరిషత్ కన్వీనర్ సూర్యప్రకాష్ అన్నావఝ్జుల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే భవిష్యత్తులో గుడి, బడి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నల్లకుంటలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వేల ఎకరాల దేవుడి ఇనామ్ భూములు కబ్జాలో ఉన్నాయని, సుమారు 19 వేల ఎకరాల భూముల కేసులు న్యాయస్థానంలో నలుగుతున్నా.. ప్రభుత్వ వ్యవస్థ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ట్రిబ్యునల్ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దేవాలయ భూముల సంరక్షణ కోసం వెంటనే ట్రిబ్యునల్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కనుల పండువగా గరుడ వాహనసేవ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడి గరుడ వాహన సేవ మహోత్సవం కనుల పండువగా జరిగింది. సోమవారం రాత్రి ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, ఆలయం వంశీయుడు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయుల సమక్షంలో రమణీయంగా సాగింది. అనంతరం గరుడవాహన సేవ చిక్కడపల్లి శ్రీనివాసపురం తిరువీధుల మీదుగా నిర్వహించారు. కాగా మంగళవారం శ్రీవారం శృంగార రథోత్సవ సేవ ఉంటుందని అధికారులు ప్రకటించారు.

ఫిర్యాదులు చేసిన పట్టించుకోరా..?



సామాజిక వేత్త లింగా ప్రకాష్‌గుప్తా

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ భవన నిర్మాణాలు పెరిగిపోతున్నాయని ప్రముఖ సామాజికవేత్త లింగా ప్రకాష్‌గుప్తా అన్నారు. అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులకు పలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సోమవారం సాయంత్రం అడిక్‌మెట్ డివిజన్ పద్మకాలనీలో ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని నివారించడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మెడికల్ సీట్ల భర్తీలో ఇతర వర్గాలకు నష్టం లేకుండా చూడాలి



మాట్లాడుతున్న బిజ్జి కనకేష్‌కుమార్

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10 శాతం సీట్లు కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం భోలక్‌పూర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మెడికల్ కాలేజీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. మెడికల్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీట్ల కేటాయింపుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా మహంకాళి జిల్లా కార్యదర్శి నర్సింగ్‌రావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

బీసీల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలి



మాట్లాడుతున్న కాటం నరసింహయాదవ్

పంజగుట్ట: రాష్ట్రంలోని బీసీ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చి ప్రతి కార్పొరేషన్‌కు రూ. వంద కోట్ల నిధులను విడుదల చేయాలని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం తుమ్మలబస్తీలోని వేదిక రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చట్టసభల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తేనే బీసీల హక్కులను సాధించుకునే అవకాశం ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని.. లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బీసీల డిమాండ్లు ఉద్యమ రూపం దాల్చకముందే ప్రభుత్వం అన్నిరంగాల్లో బీసీలకు న్యాయం చేయాలన్నారు. నగర అధ్యక్షుడు ఎ.వెంకటేష్ గౌడ్, బి.ప్రకాశ్ సింగ్, కె.మురారి, శ్రీనివాస్ చారి, రుక్మిణి, కొండపర్తి జ్యోతి, గుల్లపల్లి విజయలక్ష్మి, కిషన్, డి.ఆనందంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.